మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి:జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 09 ప్రభాతవార్త:** మార్చి 13వ తేదీన నిర్వహించే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై ఏఈఆర్‌ఓలు పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు 14 పోలింగ్ స్టేషన్లు, 6 రూట్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన రూట్ అధికారులు, పీఓలు, పోలింగ్ మెటీరియల్ తదితర అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1822 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1169, మహిళా ఓటరుల 653 ఉన్నారన్నారు. అత్యధికంగా ఓటర్లు 425 మంది నాగర్‌కర్నూల్‌లో ఉన్నారని, తదుపరి స్థానంలో కల్వకుర్తిలో 354, కోడేరులో అత్యల్పంగా 18 మంది ఓటర్లు ఉన్నట్లు వివరాలు వెల్లడించారు. ఈ నెల 12న నాగర్‌కర్నూల్ జెడ్పీ మైదానంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, పోలింగ్‌కు సంబంధించిన అన్ని మెటీరియల్స్ పోలింగ్ సిబ్బందికి అందించి రూట్ వారిగా సకాలంలో పోలింగ్ స్టేషన్‌కు చేరవేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రూట్ మొబైల్‌పార్టీ, ప్రతి పోలింగ్ స్టేషన్ దగ్గర పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను సూచించారు. ఎన్నికలు పూర్తి అయ్యాక బ్యాలెట్ బాక్స్‌లను ఎస్కార్ట్‌తో హైదరాబాద్‌లో రిసిప్షన్ సెంటర్‌కు చేరవేసే వరకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి మంచినీరు, భోజనం, టెంట్ తదితర ఏర్పాట్లు ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని, ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మనుచౌదరి, అడిషనల్ ఎస్పీ రామేశ్వర్‌రావు, ఆర్డీఓలు, ఏఓ శ్రీనివాస్, సి.సెక్షన్ సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు ఉన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతం చేసేందుకు
# ఎన్నికల అధికారులు, సిబ్బంది కృషి చేయాలి..
### జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి,మార్చి 09 ప్రభాతవార్త :** ఈనెల 13న జరిగే మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్యే ఎన్నికలను విజయవంతం చేసేందుకు ఎన్నికల అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఎన్నికల అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ హాలులో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులపై అవగాహన బ్యాలెట్ పత్రాలు, సామాగ్రి చేరవేత కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి నోడల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ ఆఫీసర్లు పోలింగ్ మెటీరియల్ అందజేయాలన్నారు. జిల్లాకు 3న బ్యాలెట్ బాక్సులు వచ్చాయని, ఆయా రూట్లలో ఆర్టీసి మిని బస్సులో 5 కేటాయించడం జరిగిందన్నారు. వెహికల్ నంబర్లలో ప్రొసీడింగ్స్ ఇవ్వాలని, రూట్ల వారిగా సీటింగ్ కెపాసిటిని బట్టి పోలింగ్ కేంద్రాలలో ఇస్తూ మళ్లీ పోలింగ్ అయిపోయాక సాయంత్రం తిరిగి బ్యాలెట్ బాక్సులు, సిబ్బందిని అదే బస్సులలో తరలించాలని అన్నారు. ఎన్నికల సామాగ్రిని డిఏఓ ఆధ్వర్యంలో మెటీరియల్ అన్ని కలిపి అందజేయాలన్నారు. ఇందుకుగాను తగిన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాబాలలో వెబ్ కాస్టింగ్ కొరకు తగు చర్యలు తీసుకోవాలని మైక్రో అబ్జర్వలకు అవగాహన కల్పించాలన్నారు. మెడికల్ టీంలు ఏర్పాటు చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. రూట్ల వారిగా పోలీస్ బందోబస్తుకు సంబంధించిన నివేదిక అందజేయాలన్నారు. బస్సులు ఎక్కడ కూడా ఆగకుండా ముందే డీజిల్ పోసుకుని రోడ్లలో ఎన్నికల సామాగ్రి సేకరించి ఎక్కడ బస్సు నిలపకుండా హైదరాబాద్ వెళ్లాల్సి ఉంటుందని అధికారులను ఆదేశించారు. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఆయా పోలింగ్ స్టేషన్ పరిధిలో బార్ వైన్ షాపులు మూసి ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో ఐదు రూట్లలో గద్వాల, ధరూర్ గట్టు, అయిజ,మల్దకల్, వడ్డేపల్లి, ఇటిక్యాల, మానవపాడు, ఉండవల్లి, అలంపూర్ రూట్లవారిగా బస్సులను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, ఆర్డీఓ రాములు, సూపరింటెండెంట్ వరలక్ష్మి, ధరణి, నరేష్, జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

## పెండింగ్ కేసులపై, ఫంక్షనల్
# వర్టికల్స్ సమీక్ష నిర్వహించిన డీఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి,మార్చి 09 ప్రభాతవార్త :** మరికల్ సర్కిల్ కార్యాలయ పరిధిలోని పోలీసు అధికారులతో డీఎస్పీ కె. సత్యనారాయణ గురువారం ఉదయం సమీక్ష నిర్వహించారు. పెండింగ్ ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి సిఐని, ఎస్సైలను అడిగి తెలుసుకుని ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలి, ఏఏ అంశాలు క్రోడీకరించాలి తదితర అంశాల గురించి వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి, కేసులు చేధాంచాలని, కేసుల్లో శిక్షల శాతం పెంచాలని, ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలని కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. గంజాయి,గుట్కా, పేకాటపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి, 60 రోజుల్లో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలి. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్‌మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. ఆత్మహత్యల కేసులలో అన్ని కోణాలలో ఇన్వెస్టిగేషన్ చేసి కేసు ఫైనల్ చేయాలని సూచించారు. ఆత్మహత్యల కేసులలో అన్ని కోణాలలో ఇన్వెస్టిగేషన్ చేసి కేసు ఫైనల్ చేయాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించాలి, కేసుల ఛేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలి. పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ఛాలెంజ్‌గా విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి, కోర్టులో చార్జిషీటు దాఖలు చేయాలన్నారు. రిసెప్షన్, క్రైమ్ వర్టికల్, టెక్‌టీమ్, స్టేషన్ రైటర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్, తదితర వర్టికల్, విధులు నిర్వహించే అధికారులకు సిబ్బందికి తరచుగా శిక్షణ తరగతులు నిర్వహించి వారి పనితనాన్ని మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. కేసు నమోదు నుండి చార్జీషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకశంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. రాత్రి పెట్రోలింగ్ అధికారులు పాత నేరస్తులను తనిఖీ చేయాలని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ గురించి గ్రామాలలో పట్టణాలలో గ్రామాల విపిఓలు, పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రోయాక్టివ్ పోలీసింగ్ విధులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంట గొడవలు లేకుండా తమ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలతో మమేకమవుతూ విధులు నిర్వర్తించాలని తెలిపారు.సమావేశంలో సిఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సైలు అశోక్‌బాబు, విక్రమ్, రమేష్ పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న డీఎస్పీ

# మహిళా చట్టాలపై అవగాహన కల్గి ఉండాలి..
### మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మార్చి 9,ప్రభాతవార్త :** స్త్రీలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కోవడానికి ఎన్నో రకాల చట్టాలు ఉన్నాయని, వాటిపై పూర్తి అవగాహన లేక చాలా మందికి అన్యాయం జరుగుతుందని ఎస్పీ నరసింహ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం ఫర్ ఉమెన్ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల హక్కులు,చట్టాల గురించి వివరించారు. పూర్వ కాలం నుంచి స్త్రీల కోసం చట్టాలున్నా నేటి వరకు సమానత్వం రక్షణ కరువైందన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకుని ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. జిల్లా పోలీస్ శాఖ తరఫున కళాబృందం,యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్,షీ టీం ద్వారా నిత్యం అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.కార్యక్రమంలో సివిల్‌జడ్జి సంధ్యారాణి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ రామ్‌భక్షి, పీపీలు జనార్ధన్,తిరుపతి,డీఎస్పీలు వెంకటరమణ,మధు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఆత్మగౌరవం కోసమే...
# రాజీనామాలు..!



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ మేఘారెడ్డి, జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి, ఎంపీపీ కిచ్చారెడ్డి

**జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి..**
**20ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా..**
**ఎవరికీ చేయి చాపలేదు..**
**పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి..**
**బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పిన జడ్పీ చైర్మెన్, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు...**



రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న ప్రజాప్రతినిధులు

**వనపర్తి ప్రతినిధి,మార్చి 09 ప్రభాతవార్త:**బీఆర్ఎస్‌లో ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేకే రాజీనామాకు సిద్దపడినట్లు వనపర్తి జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి అన్నారు. గురువారం జల్లాఘణపురం మండలం సల్కలపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి, వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి సల్కలపురం మార్కెట్ డైరెక్టర్ చరణ్ కుమార్ రెడ్డి పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ మామూలు కార్మికులు సైతం ఆత్మగౌరవం కోరుకుంటారని అలాంటిది ప్రజలిచ్చిన అధికారంలో ఉండి కూడా ఆత్మగౌరవాన్ని పొందలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీనామా చేసిన మేము ప్రజల్లోకి వెళ్లి ఎందుకు అభివృద్ధి చేయలేకపోయామో ఎందుకు వాగ్దానాలు నెరవేర్చలేకపోయామో ప్రజలకు వివరిస్తామన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయం ఎలా సూచిస్తే ఎలా కోరుకుంటే అలాగే ముందుకు వెళతామని ఈ మేరకు మరో 20రోజుల తరువాత పాత్రికేయుల సమక్షంలోనే కార్యచరణ వెల్లడిస్తామని వివరించారు.

**20ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా..**
**ఎవరికి చేయి చాపలేదు: ఎంపీపీ మేఘారెడ్డి..**

తాను 20ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని ఎవరితోనూ ఏనాడు ఒక్క రూపాయి ఆశించకుండా రాజకీయం చేశానని తాను అలా చేసినట్లు అయితే లీగల్‌గా సంపాదించలేదని నిరూపిస్తే ఉరి వేసుకునేందుకు సిద్దమని ఇదే తరహాలో ప్రకటించేందుకు ఉరి వేసుకునేందుకు మంత్రి నిరంజన్ రెడ్డి సిద్దమా అని బీఆర్ఎస్‌కు రాజీనామ చేసిన పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి సవాల్ విసిరారు. నిరంజన్ రెడ్డి కి నీళ్ల నిరంజన్ రెడ్డి పేరు వచ్చేందుకు తమ శ్రమే కారమని కాకపోతే కాస్త భయంతో ప్రజలు ధైర్యంగా ముందుకు రాలేకపోతున్నారని ఈ ప్రాంతానికి నీళ్లు తెచ్చిందో ఎవరో ప్రజల మనస్సులో ఉందని త్వరలో ప్రజలు చెప్పే రోజులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వనపర్తిని వనపర్తి వారే పాలించాలని పక్క ప్రాంతం వ్యక్తులకు అవకాశం ఇవ్వొద్దని వనపర్తి నియోజకవర్గ మేధావులు, విద్యావంతులు, ఉద్యోగులు, యువత, ప్రజలు ఆలోచించాలని పిలుపునిచ్చారు. నియంత పాలన అంతం కోసం ఇకనుంచి పెద్దఎత్తున పోరాటం చేస్తామని అన్నారు. బెదిరింపులు పిచ్చి మాటలు మానుకోకపోతే ఊరుకునేది లేదని తీవ్ర స్థాయిలో ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపీటీసీలు, మార్కెట్ డైరెక్టర్లతో పాటు మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, పలువురు బీఆర్ఎస్ కు రాజీనామా చేశారు.

**బీఆర్ఎస్ కు రాజీనామాలు చేసిన ప్రజాప్రతినిధులు..**

బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన వారిలో జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డితో పాటు వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి, పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి, పెద్దమందడి సర్పంచ్ వెంకటస్వామి సాగర్, వెల్టూరు సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ముందరి తాండ సర్పంచ్ జయంతి, మంగంపల్లి సర్పంచ్ శారద మేగారెడ్డి, మనిగిళ్ల సర్పంచ్ సరితా తిరుపతి రెడ్డి, చీకరచెట్టు తాండా సర్పంచ్ రాధాకృష్ణ నాయక్, అమ్మపల్లి సర్పంచ్ రమేష్ యాదవ్ స్కూల్ తాండా సర్పంచ్ మెఘావత్ సజ్జిని, చిలుకటోనిపల్లి సర్పంచ్ పద్మకృష్ణ, వనపర్తి మండలం సవాయిగూడెం సర్పంచ్ సువర్ణకిచ్చారెడ్డి, ఎంపీటీసీలు, ఎంపీపీలుగా కొనసాగుతున్న మేఘారెడ్డి, కిచ్చారెడ్డిలతో పాటు కాశీంనగర్ ఎంపీటీసీ నాగరాజు,గట్టు ఖానాపురం ఎంపీటీసీ దామోదర్, సల్కలపూర్ ఎంపీటీసీ లావణ్య జితేందర్ రెడ్డి, వెల్టూరు ఎంపీటీసీ అంజనమ్మ, పెద్దమందడి ఎంపీటీసీ భారతి, పామిరెడ్డిపల్లి ఇందిరమ్మ లతో పాటు సుమారు 300మంది వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

# సారిక, పోతులమడుగు టౌన్‌షిప్‌లు ప్రభుత్వ లేఔట్ లే..
### ఈనెల 16 నుంచి 18 వరకు వేలంపాట మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి. రవినాయక్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మార్చి 09 ప్రభాతవార్త :** అమిస్తాపూర్ వద్ద ఉన్న సారిక టౌన్‌షిప్, అలాగే పోతులమడుగు టౌన్‌షిప్‌లో ఓపెన్ ప్లాట్లు పూర్తిగా ప్రభుత్వం ఆధ్వర్యంలోనే రూపొందించిన లే అవుట్లని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ అన్నారు. పోతులమడుగు, సారి టౌన్‌షిప్‌లలోని ఓపెన్ ప్లాట్లకు ఈనెల 16 నుండి 18 వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాదం రామస్వామి ఆడిటోరియంలో నిర్వహించనున్న బహిరంగ వేలం సందర్భంగా అవగాహన నిమిత్తం గురువారం జిల్ల కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించి ప్రిబిడ్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సారిక టౌన్‌షిప్‌తో పాటు, పోతులమడుగు టౌన్‌షిప్‌లోని ప్లాట్లను తాను స్వయంగా సందర్శించడం జరిగిందని, ఈ రెండు టౌన్‌షిప్‌లో అన్ని రకాల సౌకర్యాలతో పాటు కలెక్టర్ కార్యాలయానికి, నేషనల్ హైవేకి దగ్గరగా ఉన్నాయని, అదేవిధంగా ధర కూడా అందరికి ఆమోదయోగ్యంగా ఉందని అన్నారు. ఐదేళ్లలో ఈ ప్లాట్ల విలువలు సగానికి సగం పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ప్రైవేట్ ప్లాట్లు, లే ఔట్లలో తీసుకున్నట్లయితే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందని, ఈ రెండు లే అవుట్లు పూర్తిగా ప్రభుత్వమే చేస్తున్నందున ఎలాంటి అనుమానాలు, సందేహాలు అవసరం లేదని, ఈ ప్లాట్‌లపై ఏవైనా సమస్యలు వచ్చినట్లయితే ప్రభుత్వమే వాటి బాధ్యత తీసుకుటుందని తెలిపారు. ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు బాగా ఆలోచించి ఈ ప్లాట్లను కొనుగోలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ నెల 11,12 తేదీలలో సెలవులు ఉన్నందున ప్లాట్లు తీసుకోవాలనుకునే వారు స్వయంగా సందర్శించవచ్చని ఆయన వెల్లడించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, సారిక టౌన్‌షిప్, పోతులమడుగు టౌన్‌షిప్ ప్లాట్ల గురించి వివరించారు. గృహ నిర్మాణ శాఖ ఈఈ, వైద్యం భాస్కర్, ఎల్డీఎం భాస్కర్‌లు రెండు టౌన్‌షిప్‌లలో ఉన్న ప్లాట్‌ల కొలతలు, లే అవుట్ రహదారులు, ఇతర వసతులు, బ్యాంకు రుణం, వడ్డీ తదితర వివరాలను వెల్లడించారు. కాగా అమిస్తాపూర్‌లోని సారిక టౌన్‌షిప్‌లో ఉన్న 96 ప్లాట్‌లకు మార్చి 17,18 తేదీలలో మహబూబ్‌నగర్‌లోని బాదం సరోజిని ఆడిటోరియంలో బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుంది. ఈ ప్లాట్లు 60 చదనపు గజాలు మొదలుకొని, 266 చదరపు గజాల వరకు ఉన్నాయి. వీటికి కనీస ధర 7,8 వేల రూపాయలు నిర్ణయించినట్లు తెలిపారు. పోతులమడుగులో ఉన్న 160 ఓపెన్ ప్లాట్‌లకు మార్చి 16,17,18 తేదీలలో మహబూబ్‌నగర్‌లోని బాదం సరోజిని ఆడిటోరియంలో బహిరంగ వేలం నిర్వహించనున్నారు. పోతులమడుగు టౌన్‌షిప్‌లో ఉన్న ప్లాట్లు 140 చదరపు గజాలు ఉన్నాయని, వీటికి కనీస ధర 5500, 6000ల వరకు నిర్ణయించారు. ఈ ప్లాట్‌లకు నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనేవారు ధరావత్తు కింద రూ. 10 వేలు చెల్లించాలని కలెక్టర్ తెలిపారు. ఈ లే అవుట్లు పూర్తిగా ప్రభుత్వ - మిగతా2లో..




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రవినాయక్

## ఆర్డీఎస్ కాల్వకు
# నీటి మాఫియా ముప్పు..
### చివరి ఆయకట్టు ప్రాంతంలో ఎండుతున్న పంటలు



రంధ్రాల ద్వారా పారుతున్న నీరు

**అలంపూర్,మార్చి 09 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజకవర్గంలో ఉన్న ఆర్డీఎస్ ఆయకట్టు కింద చివరి ప్రాంతం వరకు 85 వేల ఎకరాలకు సాగునీరు పంటలకు అందాల్సి ఉంది. కానీ ఆర్డీఎస్ వాటాద్వారా వచ్చేనీరు డిస్ట్రిబ్యూటరీ 24 వరకు అరకొరగా పారడం జరుగుతుంది. రాజుల సొమ్ము రాళ్లపాలు అన్నట్లు ఆర్డీఎస్ నీళ్ల కూడా నీటి మాఫియా పాలు కావడం జరుగుతుంది. డిస్ట్రిబ్యూటరీ 22,23 మధ్య ఉన్న రేణు కాలువ ద్వారా, అక్రమ రంధ్రాలతో ఒక డిస్ట్రిబ్యూటరీలో పంట నీరు ఎంత డెలివరీ అవుతుందో అంత నీటని నీటి మాఫియా దొంగల అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నారు. దీనితో చివరి ఆకట్టు ప్రాంతంలో ఉన్న పంటలకు నీటి తడులు అందకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉంది. మరింత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే, నీటి ఇరిగేషన్ అధికారులు, జిల్లా కలెక్టర్ నీటి మాఫియా దొంగలను ఎందుకు పట్టించుకోవడం లేదని, వెంటనే నీటి మాఫియా దొంగలపై కఠినమైన చర్యలు - మిగతా2లో..

## మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించి
# మందులు అందజేయాలి..
### మొక్కలు ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం నీరు పట్టించాలి.. జిల్లా ఇంచార్జీ కలెక్టర్ ఆశీశ సంగ్వాన్..



నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా ఇంచార్జీ కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్



మన ఊరు మన బడి పనులను పరిశీలిస్తున్న ఇంచార్జీ కలెక్టర్



కంటి వెలుగు కార్యక్రమంలో..



ఆయిల్‌ఫామ్ తోటలను సందర్శిస్తున్న ఇంచార్జీ కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి,మార్చి 09 ప్రభాతవార్త:** పేద ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని జిల్లా ఇంచార్జీ ఆశీశ్ సంగ్వాన్ అన్నారు. జిల్లాలోని కడుకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి సిబ్బంది అధికారులు హాజరై తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం కడుకుంట్ల గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులని పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు అమలులో విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఏ విధమైన అలసత్వ ప్రదర్శించకుండా నిర్దేశించిన లక్ష్యం చేరాలని సూచించారు. అనంతరం లబ్దిదారులతో మాట్లాడి కంటి అద్దాలను పంపిణీ చేశారు. అలాగే మన ఊరు మన బడి కార్యక్రమం కింద నిర్మించిన పనులను ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ తనిఖీ చేశారు. అలాగే గ్రామంలో లైబ్రరీని సందర్శించారు. ఏర్పాటు చేసిన ఆయిల్‌ఫామ్ నర్సరీని కలెక్టర్ పరిశీలించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం నీరు పట్టించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సురేష్,డీఎమ్‌హెచ్ఓ రవిశంకర్, ఎంపీడీఓ ఏపీఓ హెడ్మాస్టర్, వైద్యా అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ జేబు సంస్థలుగా ఈడీ సీబీఐలు..

**- కక్ష్య సాధింపు చర్యలో భాగంగానే ఎంపీ కవితకు ఈడీ నోటీసులు**

**- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డి**



**కల్వకుర్తి,మార్చి09 ప్రభాతవార్త:**స్వయం ప్రతిపత్తి గల ఈడీ సీబీఐ సంస్థలు బీజేపీ పార్టీకి కొమ్ముగాసే జేబు సంస్థలుగా మారాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోళి శ్రీనివాసరెడ్డి దుయ్యబట్టారు. గురువారం కల్వకుర్తిలో ఆయన మాట్లాడుతూ బీజేపీ తాటాకు చప్పుళ్లకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ భయపడే రకం కాదన్నారు. దేశ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి పలు రాష్ట్రాల్లో ఆదరణ పెరుగుతున్న దృష్ట్యా బీజేపీ ఓర్వలేకనే ఇలాంటి చౌకబారు చర్యలకు పాల్పడుతుందని ఆయన దుయ్యబట్టారు. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా అవతరిం చిన కొద్ది రోజుల్లోనే పలు రాష్ట్రాల్లో బీఆర్ఎస్‌కు ఆదరణ పెరుగుతుందని, ఇది బీజేపీ పాలకులకు కంటగింపుగా మారిందన్నారు. కేంద్ర సర్కార్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన బీఆర్ఎస్ పార్టీని ఢీకొనలేదని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ కూతురు ఎంపీ కవితను ఈడీ అధికారులు ఢిల్లీకి పిలువడం కక్ష్య సాధింపు చర్యలో భాగమేనని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి బీజేపీ ప్రత్యామ్నాయంగా మారనుందని గోళి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన వెంట ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుభాష్, పెద్దాపూర్ సర్పంచ్ గోరటి శ్రీనివాస్, సుమన్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యం:ఎంపిపి

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**





**తెల్కపల్లి,మార్చి 09 ప్రభాతవార్త :** నాణ్యమైన విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ప్రతి ఒక్కరు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని, సమాజ అభి వృద్ధికి తమతోడ్పాటును అందించాలని ఎంపిపి కొమ్ముమధు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సిద్ధార్థ మోడల్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థి ఉపాధ్యాయులు అధికారులుగా విధులు నిర్వ హించి తమతోటి విద్యార్థులకు బోధన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎంపిపి కొమ్ముమధు ముఖ్య అతిథిగా పాల్గొని చక్కగా బోధించిన విద్యార్థి ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు ఆర్. రమేష్, లక్ష్మమ్మ, ఎక్సైజ్ ఎస్సై జనార్ధన్, ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసులుగౌడ్, ఎం. విజయ్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండేరు, ఎర్రవల్లిలో చలివేంద్రాల ఏర్పాటు..

**ప్రారంభించిన ఎస్సై గోకారి**



**ఇటిక్యాల,మార్చి 09 ప్రభాతవార్త :** వేసవికాలం కావడంతో ప్రజలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుండగా ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకు గాను పోతురాజు శంకరమ్మ సేవాదళ్ ఆధ్వర్యంలో గురువారం ఎర్రవల్లి చౌరస్తాలో ఎస్సై గోకారి చలివేంద్రాన్ని ప్రారంభించారు. అదేవిధంగా మండల పరిధిలోని కొండేరు గ్రామంలో పోతురాజు బుచ్చన్న చలివేంద్రాన్ని ప్రారంభించారు. తనతల్లి పోతురాజు శంకరమ్మ జ్ఞాపకార్థంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు మండలంలో ప్రధాన కూడళ్ల దగ్గర ప్రజల దాహార్తిని తీర్చేందుకు పోతురాజు శంకరమ్మ జ్ఞాపకార్థంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు మండలంలో ప్రధాన కూడళ్ల దగ్గర ప్రజల దాహార్తిని తీర్చేందుకు పోతురాజు శంకరమ్మ సేవాదళ్ ఆధ్వర్యంలో మరిన్ని ఏర్పాటు చేస్తామని వారి కుమారుడు విదేశాలలో స్థిరపడిన పోతురాజు సోమనాద్రి తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు యాదవ్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవలోనే తృప్తి...



**వెల్దండ, మార్చి 09 ప్రభాతవార్త:**మనం సంపాదించిన ధనంలో కొంతైన సమాజ సేవకు ఉపయో గిస్తే అందులో తృప్తి ఉందని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ అన్నారు. వెల్దండ మండలం భైరాపూర్ గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఉప్పల వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణకై ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉప్పల వెంకటేష్ తనయుడు అచల్ కామినేని వైద్య బృందంతో 155 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. అనంతరం విద్యార్థులకు ఏక రూప దుస్తులను అందించారు. కార్యక్రమంలో ఉప్పల వెంకటేష్ సతీమణి ఉప్పల మంజుల, తలకొండపల్లి ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్, శృతిలయ కల్చర్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్‌దాస్, పూరి రమేష్, జగదీష్, అరవింద్, విజేష్‌నాయక్, తౌర్యనాయక్, శంకర్‌నాయక్, ఆంజనేయులు, యాదమ్మ, సత్తయ్య, శ్రీకాంత్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## జిల్లా బీఎస్పీ పార్టీ ఇంఛార్జిగా ఎంజి కృష్ణ నియామకం

**రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**



**ఇటిక్యాల,మార్చి 09 ప్రభాతవార్త :** మండల పరిధిలోని షేక్‌పల్లె గ్రామానికి చెందిన సీనియర్ బీఎస్పీ పార్టీ నాయకులు ఎంజి కృష్ణను జోగులాంబ గద్వాల జిల్లా పార్టీ ఇంఛార్జిగా నియమిస్తూ గురువారం అలంపూర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎంజి కృష్ణకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా బీఎస్పీ పార్టీ ఇంఛార్జి ఎంజి కృష్ణ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో బీఎస్పీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పోలింగ్ బూత్‌ల వారిగా ఆర్టీ బలోపేతానికి కృషి చేస్తానని వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని ఎంజి కృష్ణ అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్, గద్వాల, అలంపూర్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఎస్ కాల్వకు నీటి మాఫియా ముప్పు..

మొదటిపేజీ తరువాయి భాగం...



రంధ్రాల ద్వారా పారుతున్న నీరు

తీసుకొని చివరి ఆయకట్టు ప్రాంతం వరకు ఉన్న పంటలకు నీటి తడులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. నీటి మాఫియా దొంగలు అక్రమ రంధ్రాల ద్వారా తరలించుకుపోతున్న నీళ్లద్వారా పచ్చని పంట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయి. మర రైతురాజు అన్నారు. రైతు శ్రేయస్సే మా లక్ష్యం అన్నారు. అలంపూర్‌ను కోనసీమను తలపించేలా చేస్తామన్నారు. ఎక్కడ? ఎండుతున్న పంటలు. అక్రమ రంధ్రాల ద్వారా పారుతున్న నీళ్లకు బీడు భూములుగా మారుతున్నాయని మా భూములకు సాగునీరందించి సాగు చేసుకునే విధంగా మాకు సాయం చేయండని రైతులు కోరుతున్నారు.

# చిన్నరాజమూరులో ఆంజనేయస్వామి పునప్రతిష్ట పూజలు ప్రారంభం

**దేవరకద్ర,మార్చి 09 ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రధాన దేవాలయాలలోని ఒకటైన దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారి పునప్రతిష్ట మహోత్సవ పూజలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభయయ్యాయి. ఈ నెల 10వరకు ఈ పునప్రతిష్ట పూజలు జరుగనున్నాయి. దాదాపు రూ.40 లక్షల వ్యయంతో గర్భాలయనిర్మాణ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో దేవస్థానం అభివృద్ధికి ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా పునప్రతిష్ట పూజల మొదటిరోజు స్వామివారి సన్నిధిలో ప్రతిష్ఠాంగ మంటప స్థాపనం పూజలతో పాటు పుణ్యాహవచనం,యాగశాల ప్రవేశం,అఖండ దీపారాధన,గణపతి నవగ్రహ పూజ,ప్రతిష్ఠాంపనాగ హోమాలు జరిగాయి. అలాగే శ్రీశ్రీ 1008 శ్రీసత్యాత్మ తీర్థుల వారికి పూర్ణకుంభ స్వాగతం,ఆహ్వాహిత దేవతలకు ప్రదోశపూజ, అనుగ్రహసందేశం,మహామంగళమారతి కార్యక్రమాలను నిర్వహించారు. వేధపండితుల అధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వ్యవస్థాపక వంశీయులు రాఘవేంద్రాచారి,పరిమళాచారి,రామాచారి,భీమాచారి,హన్మేష్‌చారిలతో పాటు గ్రామస్థులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**స్వామివారికి జడ్పీచైర్మెన్ పూజలు..**

దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం జడ్పీచైర్మెన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బిజేపి పాలమూరు పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి,బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కెంగూరి కుర్వ శ్రీకాంత్‌యాదవ్,మాజీ జడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు స్వామి వారికి పూజలు నిర్వహించారు.



దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న వేధపండితులు

**నేడు పంచామృతాభిషేకం..**

దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారి పునప్రతిష్ట మహోత్సవాల సందర్భంగా స్వామివారి సన్నిదిలో శుక్రవారం రెండవరోజు పంచామృతాభిషేకం పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలాగే స్వామి వారి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు,అలంకరణ నిర్వహిస్తారు.అలాగే సంస్థాన పూజ,తీర్థప్రసాద వితవరణ,మహాస్వాములవారిచే ఫలమంత్రక్షాతలు పూజలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం వ్యవస్థాపక వంశీయులు తెలిపారు.



దేవస్తానంలో ఏర్పాటుచేసిన పూజా మంటపం

**యధావిదిగా గర్భాలయంలో స్వామివారి పూజలు..**

దేవస్థానంలో ఆంజనేయస్వామి గర్భాలయనిర్మాణ పనులు పూర్తి కావడంతో ఇకమీదట యధావిదిగా గర్భాలయంలోనే స్వామివారి పూజలు నిర్వహిస్తారు. స్వామివారు భక్తులకు అక్కడనే దర్శనమివ్వనున్నారు.

## హైదరాబాద్‌లో దారుణ హత్యకు గురైన గిరిజన యువకుడు

**-తాండలో విషాదచాయలు**



మృతి చెందిన పవన్

**వెల్దండ,మార్చి09 ప్రభాతవార్త:**మండల పరిధిలోని కేస్లీ తాండకు చెందిన దేగావత్ బుజ్జి, పూల్ సింగ్‌లు గత 20 సంవత్సరాల క్రితం జీవనోపాధి కోసం హైదరాబాద్ పహడీషరీఫ్‌లోని శాయిన్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వారికి ఒక కుమారుడు పవన్‌తో పాటు ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. పవన్ ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటూ కుటుంబ సభ్యులకు చేదోడు వాదోడుగా ఉంటు పనిచేసుకుంటున్నాడు. ఇదే క్రమంలో శాయిన్‌నగర్‌లో ఒక ముస్లిం యువతీతో ఏర్పడిన పరిచయం అది కాస్త ప్రేమగా మారింది. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు చూస్తుండగానే గుర్తు తెలియని వ్యక్తులు పవన్‌పై కత్తులతో దాడి చేసి హతమర్చారు. కుటుంబ సభ్యులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా దుండగులు కత్తులు చూపించి భయభ్రాంతులకు గురి చేశారు. పవన్ హత్యకు కారణం ప్రేవ వ్యవహారమే అని పలువురు పేర్కొంటున్నారు. పవన్ మృతిపై బాలాపూర్ పీఎస్‌లో కేసు నమోదు చేసినట్లు సమాచారం. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులు కేస్లీతాండకు తీసుకొచ్చారు.

**దుండగులను కఠినంగా శిక్షించాలి...**

గుర్తు తెలియని దుండగుల చేతిలో హత్యకు గురైన పవన్ కుటుంబాని న్ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు దుండగులను కఠినంగా శిక్షించి ఉరితీయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో గిరిజన విద్యార్థులైన నవీన్, ప్రీతి, పవన్‌లతో పాటు మరికొన్ని చోట్ల దారుణంగా హత్యలకు గురి చేయడం చాలా బాధకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే ఇలాంటి దాడులను అరికట్టాలన్నారు.

## లక్ష్మీపల్లిలో ఘనంగా మహిళాదినోత్సవం..

**- జీన్గరాలలో ఉపాధ్యాయులకు సన్మానం**



లక్ష్మీపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



జీన్గరాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్,గ్రామస్థులు

**దేవరకద్ర,మార్చి 09 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం లక్ష్మీపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణారెడ్డి సతీమణి మనెమ్మలతో పాటు ఉపాధ్యాయులు కల్పన,ఏఎన్‌యం పవిత్ర,ఆశ కార్యకర్తలు నందిని,పరమేశ్వరి,అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీలను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కష్ణారెడ్డి,ఎస్‌యంసీ చైర్మెన్ చిన్నకాశన్న,ప్రాథమిక,ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు,సల్వాచారి,ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్,బాసిద్,వెంకట్రాములు,గ్రామస్థులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

**జీన్గరాలలో..** దేవరకద్ర మండలం జీన్గరాలలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సర్పంచ్ శ్యాసుందర్‌రెడ్డి అధ్వర్యంలో గ్రామస్థులుఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు కవితతో పాటు ఉపాధ్యాయులు సత్యమ్మ,అనసూయ,విజయలక్ష్మీ, ఏడబ్లూడబ్లూలు అంజమ్మ,బుర్రమ్మ,మహిళాసంఘం అధ్యక్షురాలు సునిత,ఉపాధ్యక్షురాలు మాధవి,ఏఈఓ సాయి ప్రీతిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి,రవిబాబు,నాగరాజు,సత్యనారాయణశెట్టి,రశీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతం చేయాలి..

**వనపర్తి జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి,మార్చి 09 ప్రభాతవార్త :** ఈనెల 13న జరిగే మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతం చేయాలని ఎన్నికల సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఎన్నికల అధికారులను, సిబ్బందికి ఆదేశించారు. గురువారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన జిల్లా నోడల్ ఎన్నికల అధికారుల సమావేశంలో జిల్లాలో సదరు ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఎన్నికల సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులను నిర్వర్తించి ఎన్నికలు విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 12న వనపర్తి ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల సామాగ్రిని పోలింగ్ సిబ్బందికి అందజేస్తారని, 13న పోలింగ్ ముగిసిన వెంటనే సిబ్బందిని నేరుగా ఎన్నికల సమాగ్రితో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, హైదరాబాద్‌కు పోలీస్ బందోబస్తుతో చేరుకుని రిటర్నింగ్ అధికారిని పోలింగ్ జరిగిన బ్యాలెట్ బాక్సులు ఇతర సామాగ్రిని అందజేయాలని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో లైవ్ వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్,ఆర్డీఓ పద్మావతి, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, సర్వేవల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## ప్రేమవిఫలమై రైలుకిందపడి యువకుడి ఆత్మహత్య..



ఆత్మహత్య చేసుకొన్న మృతుడు వెంకటేశ్

**దేవరకద్ర,మార్చి 09 ప్రభాతవార్త:** ప్రేమవిఫలమై ఓ యువకుడు రైలుకిందపడి బలవన్మరాణానికి పాల్పడ్డాడు. దేవరకద్రలో గురువారం ఈ సంఘటన చోటుచేసుకొంది.రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ కథనం ప్రకారం వివరాలు ఈ విదంగా ఉన్నాయి. మహబూబ్‌నగర్ మండలం మాచన్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్(19) తన ప్రేమవిఫలం కావడంతో దేవరకద్ర ట్రాఫిక్ రైల్వేగేట్ సమీపంలో హైద్రాబాద్ నుండి కర్నూల్ వైపు వెళ్ళే తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ సంఘటనలో వెంకటేశ్ శరీరం నుండి మొండెం వేరై పడింది. ఈ విషయం తెలుసుకొన్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి శవపంచనామ నిర్వహించారు. అనంతరం మృతుడి శవాన్ని పోస్తుమార్టమ్ నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ తెలిపారు.

## సారిక, పోతులమడుగు టౌన్‌షిప్‌లు ప్రభుత్వ లేఔట్ లే..

మొదటి పేజీ తరువాయి భాగం...

ఆధ్వర్యంలో రూపొందించి, అనుమతించిన లే అవుట్లని, ఎలాంటి చిక్కులు గాని, వివాదాలు కాని లేవని, వెంటనే ఈ ప్లాట్లలో నిర్మాణాలను కూడా చేపట్టేందుకు నివాసము, బహుళ ప్రయోజనాలు ఉన్న ప్లాట్‌లని వారు తెలిపారు. అదేవిధంగా భూమికి సంబంధించి ఎలాంటి మారునపలు చేయాల్సిన అవసరం కూడా లేదని, ముఖ్యమైన ప్రాంతాలలో ఈ ప్లాట్లు ఉన్నాయని, అన్ని వసతులతో, అంతర్గత రహదారుల నిర్మాణం, వీధిదీపాలు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రణాళికాబద్దంగా ఈ లే ఔట్లను ప్రభుత్వమే అభివృద్ధి చేసిందని తెలిపారు. అన్ని వివరాలతో పాటు, సైటుకు సంబంధించిన వివరాల బ్రోచ్లను ప్రి బిడ్ సమావేశంలో పొందవచ్చని, అంతేకాక హెచ్‌టిటిపిఎస్// మహబూబ్‌నగర్.తెలంగాణ.జిఓవి.ఇన్ కాని లేదా యుఎన్‌డిఎ. జిఓవి.ఇన్/ఆక్షన్స్/ టిఎస్‌ఐఐసి.తెలంగాణ.జిఓవి.ఇన్ లేదా స్వగృహ.తెలంగాణ.ఇన్‌లో పొందవచ్చని వెల్లడించారు. అలాగే ఫోన్ నంబర్లు 08542 241165,7675075365 లేదా 7993455775కు సంప్రదించవచ్చని తెలిపారు. సమావేశంలో జిల్లా అధికారులతో పాటు సిబ్బంది, ప్రైవేట్ వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## కెటిదొడ్డి, గట్టు మండలాలలో పలు శుభకార్యాలలో పాల్గొన్న ఎమ్మెల్యే



**కెటిదొడ్డి,మార్చి09 ప్రభాతవార్త:**జోగులాంబ గద్వాల నియోజకవర్గం కెటిదొడ్డి, గట్టు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం జరిగిన వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబురామన్‌గౌడ్,ఎంపిపి విజయ్,వైస్‌ఎంపి పి రామకృష్ణనాయుడు, కెటిదొడ్డి మండల పార్టీ అధ్యక్షుడు ఉరుకుందు, గట్టు మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ఎంపిటిసి, బిఆర్ఎస్‌పార్టీ నాయకులు మిల్లు వీరన్న, రంగారెడ్డి, ఎస్. రామునాయుడు, సప్లయ్ ఆంజనేయులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## సిఐ రజితారెడ్డిని సన్మానించిన జెట్టినరసింహ్మారెడ్డి



**దేవరకద్ర,మార్చి 09 ప్రభాతవార్త:** భూత్పూర్ సిఐ రజితారెడ్డిని బుధవారం రాత్రి దేవరకద్ర మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినో త్సవం సందర్భంగా మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి అధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఈ సన్మాన కార్యక్ర మాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా కేక్ కట్ చేసి సిఐ రజితారెడ్డితో పాటు మహిళాపోలీసులకు శాలువాలతో సత్కరించారు. స్వీట్లు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డితో పాటు ఎస్ఐ భగవంతరెడ్డి,నాయకులు భాస్కర్‌రెడ్డి,అంజ నేయులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ధూంధాం గోడ పత్రికను విడుదల చేసిన సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి



**వెల్దండ, మార్చి 09 ప్రభాతవార్త:**మహిళా దినోత్సవ ధూంధాం గోడ పత్రికను సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పాలాది శ్రీకాంత్, కొమ్ము రాజులు మాట్లాడుతూ ఆమనగల్లులోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం 1 గంటలకు ధూంధాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గోడ పత్రిక విడుదల ఉపాధ్యాయులు, నాయకులు గజిని శ్రీను తదితరులు ఉన్నారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు..

**రూ.6319 ధర పలికిన కింటాల్ ఆముదాలు**

**దేవరకద్ర,మార్చి 09 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం 10 కింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితే కింటాల్ ఆముదాలకు అత్యధికంగా రూ.6319 ధర పలికింది. అలాగే అతి తక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## నర్సరీలను పరిశీలించిన ఎంపీడీఓ



**వెల్దండ, మార్చి 09 ప్రభాతవార్త:**మండల పరిధిలోని బొల్లంపల్లి, బండోనిపల్లి గ్రామాల్లోని నర్సరీలను ఎంపీడీఓ శ్రీనివాసులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ హరితహరంలో భాగంగా గ్రామ పంచాయతీలకు నర్సరీల్లో మొక్కల పెంపకానికి కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా మొక్కలకు నీరందించి అన్ని విధాలుగా సంరక్షించి హరితహరానికి సిద్ధంచేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం ఈశ్వరజీ ఉన్నారు.

## వివాహవేడుకల్లో కొండ ప్రశాంత్‌రెడ్డి



**దేవరకద్ర,మార్చి 09 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం చిన్నరాజమూర్‌లో గురువారం జరిగిన పలు వివాహవేడుకల్లో టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.ఈసందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశిర్వదించారు.ఈకార్యక్రమంలో కేపీఆర్ యూత్ అధ్యక్షుడు రాజు,వాకిటి అంజనేయులు,కురుమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

## రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**వీపనగండ్ల, మార్చి9 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తూముకుంట గ్రామంలో 2వ విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమైందని మండల వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ఎవరికి కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ మెడికల్ ఆఫీసర్ డా.జి.శ్వేత, క్యాంపు కోఆర్డినేటర్ విజయ్ కుమారి, పద్మ, స్టాఫ్ నర్స్, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి జానకి

**పెబ్బేరు, మార్చి9 ప్రభాతవార్త:** మహిళలు చట్టం పై అవగాహన కలిగి ఉండాలని వనపర్తి జూనియర్ సివిల్ జడ్జి జానకి సూచించారు. గురువారం పెబ్బేరు మున్సిపాలిటీ సమావేశ మందిరంలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మహిళలు ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల్లో రాణిస్తున్నారు కానీ చట్టాలపై అవగాహన కలిగి ఉండకపోవడం బాధాకరమని చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉంటే సమాజం ఇంకా అభివృద్ధి చెందుతుందని, చిన్న చిన్న సమస్యలను వారే అధిగమిస్తారని అన్నారు. ముఖ్యంగా మహిళలు, కుటుంబ సభ్యులతో గొడవపడి వివిధ రకాల కేసుల్లో కోర్టుకు వస్తున్నారని చట్టంపై అవగాహన ఉంటే వాటిని అధిగమిస్తారని అన్నారు. సీనియర్ న్యాయవాది పుష్పలత మాట్లాడుతూ మహిళలపట్ల జరుగుతున్న దురాగతాలకు చాలా రకాల కేసులు ఉన్నాయని ఫోక్సో, డీవీసీ, బరణం కోరే తదితర కేసుల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలకు కోర్టు కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కరుణశ్రీ, మున్సిపల్ కమీషనర్ జాన్‌కృపాకర్, లోక్ అదాలత్ సిబ్బంది నాగలక్ష్మీ, నాయకులు సాయినాథ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామర్థ్య పరీక్ష



విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు సతీష్ కుమార్

**కొత్తకోట, మార్చి 9 ప్రభాతవార్త:** పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు గురువారం రాష్ట్ర పరిశీలకులు సతీష్ కుమార్ విద్యా సామర్థ్య పరీక్షను నిర్వహించారు. 1నుండి 6వ తరగతి వరకు అభ్యాస మాదిరిగా, 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు కూడా సామర్థ్య పరీక్షలను నిర్వహించి వారి ప్రతిభను గుర్తిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా విద్యార్థులు మంచి మార్కులు సాధించే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతారని, ఉపాధ్యాయులకు కూడా అభ్యాసంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంజులత, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## వరి పంట చివరి వరకు నీళ్లు ఇవ్వాలి



జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు డి.బాల్‌రెడ్డి

**వీపనగండ్ల, మార్చి 9 ప్రభాతవార్త:** రైతులు తెలంగాణ ప్రభుత్వం మీద ఎంతో నమ్మకంతో చాలా మంది వరి పంటలు, ఆరుతడి పంటలు పండించడం జరిగింది. అయితే భీమా కాల్వ కింద ఉన్న పొలాలకు నీళ్లు సరిగ్గా అందక పోవ డంతో వలన రైతులు పంటపొలాలు నష్టపోయే అవకాశం ఉన్నందని జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.బాల్‌రెడ్డి ఇప్పటికి భీమా కాల్వకు వారానికి ఒక సారి నీళ్లు వదలడం వలన రైతుల వరి పొలాలకు ఇబ్బంది అవుతుందని అన్నారు. కాబట్టి ప్రభుత్వం ఇప్పటికే భీమా కాల్వకు వారానికి ఒకసారి నీళ్లు వదలడం వలన రైతుల వరి పొలాలకు ఇబ్బంది అవుతుందని కాబట్టి ప్రభుత్వం ఇప్పటికైనా బీమా కాల్వకు రోజువారిగా నీళ్లు వదలాలని ఆయన కోరారు

## ప్రతి ఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి



కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందం

**పాన్‌గల్, మార్చి 9 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా పేద ప్రజల కోసం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకం 33వ రోజు మండలంలో కొనసాగుతుంది. గురువారం మండల పరిధిలోని దవాజిపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ వెంకటయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు చేపట్టిందని అందులో బాగంగానే కార్పోరేట్ స్థాయి పరికరాలతో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు. చూపు మందగించిన వారికి కంటి అద్దాలు అందజేయడంతో పాటు సమస్య తీవ్రతను బట్టి కంటి శస్త్ర చికిత్సలకు కూడా చేయించడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## వివాహ వేడుకలలో గద్వాల ఎమ్మెల్యే సతీమణి

**గద్వాల ప్రతినిధి, మార్చి 09 ప్రభాతవార్త :** గద్వాల టౌన్, గద్వాల మండలం, మల్దకల్ మండలం, ధరూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలలోని వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిసతీమణి బండ్లజ్యోతి నూతన వధూవరులకు కానుకను అందజేశారు. అనంతరం గద్వాల పట్టణంలో బీరెల్లి రోడ్ సమీపంలో ధరూర్ వైస్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, సోదరుడి నూతన గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి పాల్గొన్నారు. కార్యక్రమంలో మండలాల నాయకులు, గ్రామసర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# కొనసాగుతున్న అమ్మవారి బ్రహ్మోత్సవాలు

◆ మన్యంకొండలో అశ్వవాహనంపై ఊరేగిన అలివేలుమంగతాయారు ◆ అలంకరణలో స్వామి సమేతంగా అమ్మవారి దర్శనం



మన్యంకొండలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు



అశ్వవాహనంపై స్వామిసమేతంగా అమ్మవారు

**దేవరకద్ర, మార్చి 9 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ అలివేలుమంగతాయారు దేవస్థానంలో బుధవారం రాత్రి అమ్మవారి అశ్వవాహనసేవ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మన్యంకొండలో శ్రీఅలివేలుమంగతాయారు భ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ పవిత్ర కార్యక్రమాన్ని కన్నులపండువలా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి సమేతంగా అలివేలుమంగతాయారు అమ్మవారిని అశ్వవాహనంపై ఊరేగించారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ప్రాతిరోజు ఓ సేవను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఈ పవిత్ర సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న తేరుమైదానం వరకు అశ్వవాహనసేవ నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తుల హరినామశ్వరణ, కాగడాల వెలుతురులో అమ్మవారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, తదితరపూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ కూడ వివిధ పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన అలివేలుమంగ అమ్మవారు:** మన్యంకొండలో అశ్వ వాహనసేవ సందర్భంగా అమ్మవారు అశ్వవాహనంపై స్వామి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు, బంగారు ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్, నరసింహ్మయ్య, పాలక మండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానంద చారి, సిబ్బంది సుదర్శన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా పూర్ణాహుతి, హోమం:** మన్యంకొండ శ్రీ అలివేలుమంగతాయారు భ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గురువారం దేవస్థానంలో పురోహితులుపూర్ణాహుతితో పాటు హోమాన్ని సాంప్రదాయరీతిలో వైభవంగా నిర్వహించారు. దేవస్థానంలోని మండపంలో అమ్మవారి సన్నిధిలో ఈ పవిత్రకార్యక్రమాలను నిర్వహించారు. దేవస్థానం చైర్మెన్‌అళహరి మధుసూధన్‌కుమార్ అధ్వర్యంలో పురోహితుల వేధమంత్రోశ్చరణల మద్య ఈ కార్యక్రమాన్నిభక్తిశ్రద్దలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్, నరసింహ్మయ్య, పాలకమండలి సభ్యులు, పర్యవేక్షకుడునిత్యానందచారి, సిబ్బంది సుదర్శన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళ సాధికారిత కోసం అందరు కృషి చేయాలి

● మున్సిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్

**వనపర్తి టౌన్, మార్చి 9 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జంగిడిపురం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళ దినోత్సవ వేడుకల్లో వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ పాల్గొని కాలనీలోని మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ మహిళా సాధికారిత కోసం అందరు కృషి చేయాలని అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలని మహిళాభివృద్ధి కోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అందులో భాగంగా స్థానిక సంస్థల్లో 50%రిజర్వేషన్‌లు కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు. కాలనీలోని సుమిత్రమ్మ, వెంకటేశ్వరలకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రేమలత అధ్యక్ష వహించగా మహిళలు అనురాధచ వెంకట్వేరమ్మ, వైస్‌ఎంపీపీ మాధవి మద్దిలేటిచ రామ్‌రెడ్డి, సుధాకర్, మధుసూదన్‌రావు, వెంకటరామిరెడ్డి, రవీందర్‌గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

# కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోండి

◆ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణ శ్రీసాయి



ఉచిత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

**పెబ్బేరు, మార్చి 9 ప్రభాతవార్త:** కంటి వెలుగు పథకాన్ని కాలనీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ సాయి కోరారు. గురువారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ల ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు సెంటర్9వ వార్డు తాపీ మేస్త్రీ సంఘం భవనం దగ్గర కౌన్సిలర్ అశ్విని సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ 9వ వార్డు తాపీ మేస్త్రీ సంఘం భవనం దగ్గర నిర్వహిస్తున్న ఉచిత కంటి వెలుగు కార్యక్రమాన్ని కాలనీ ప్రజలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జాన్‌కృపాకర్, 9వవార్డు కౌన్సిలర్ పద్మ వేణుయాదవ్, 8వ వార్డు కౌన్సిలర్ చిన్న ఎల్లారెడ్డి, మున్సిపల్ మేనేజర్ గణేష్ బాబు, మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బందిచ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్ర గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజా చైతన్యంపై జరిగే ఆత్మగౌరవ పాదయాత్రను జయప్రదం చేయండి: నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్



ఆత్మగౌరవ పాదయాత్ర గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**గద్వాల ప్రతినిధి, మార్చి9 ప్రభాతవార్త:** గద్వాల నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యాలయంలో మార్చి 17 నుండి నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్ర గోడపత్రికను గొంగళ్ల రంజిత్‌కుమార్ ఆవిష్కరించారు. గద్వాల నియోజకవర్గంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావడమే ధ్యేయంగా, ప్రజలను సంఘటితం చేస్తూ, ఓటు హక్కును దుర్వినియోగపరచకుండాచిత్తశద్ది గల నాయకత్వం కోసం వినియోగించుకుంటే అభివృద్ధి, సంక్షేమం జరుగుతాయని, చైతన్యం చేయడమే లక్ష్యంగా చేస్తున్న ఈ పాదయాత్రను విజయవంతం చేయాలని మేధావులకు, విద్యార్థులకు, రైతులకు, మహిళలకు, కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఆవిష్కరణ తదనంతరం గొంగళ్లరంజిత్‌కుమార్, బుచ్చిబాబు, జిల్లా కార్యదర్శి లవన్న, మల్దకల్ మండలం ఉపాధ్యక్షుడు ప్రేమ్ రాజ్, జిల్లా నాయకులు వామన్‌పల్లి రంగస్వామి, ధరూర్ మండల నాయకుడు పరశురాముడు, ధరూర్ మండల ఉపాధ్యక్షుడు మునెప్ప, లక్ష్మన్న, గోపాల్, గుండన్న, భూపతినాయుడు, చిన్నరాముడు, నేతన్న, దొడ్డన్న, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టుపడ్డ మోటర్ల దొంగలు

జూరాల కాల్వకు అమర్చిన మోటార్లు లక్ష్యంగా చేసుకున్న దొంగలు: కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి



పట్టుపడిన మోటర్లతో నిందితులు, పక్కన పోలీసులు

**పెబ్బేరు, మార్చి 9 ప్రభాతవార్త:** ఆర్థిక పరిస్థితులు, జల్సాలకు అలవాటు పడిన ముగ్గరు యువకులు దొంగతనాన్ని వృత్తిగా మార్చుకున్నారు. రైతుల పొలాల వద్ద, జూరాల కాల్వల వద్ద ఏర్పాటు చేసుకున్న ఎత్తుకెళ్లిన సొమ్ము చేసుకోవాలని అన్నారు. వాహనాల తనిఖీలో పెబ్బేరు లో పోలీసులకు చిక్కారు. ఈ సందర్భంగా కొత్తకోట సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై జగదీశ్వర్ రెడ్డితో కలిసి పెబ్బేరు పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన బోయ సురేష్, మరో మైనర్, గద్వాలజిల్లా మల్దకల్ మండలం దాసరి గ్రామానికి చెందిన తొండ మహేష్ లు 15రోజులుగా 17మోటార్ల దొంగతనాలకు పాల్పడ్డారు. వాటి విలువ రూ.2.35లక్షలు ఉంటుంది. గత నెలలో పెబ్బేరు మండలం బునియాదిపురం శివారులో పెబ్బేరు వెళ్లే రోడ్డులో జూరాల పిల్ల కాల్వ వద్ద రైతులు ఏర్పాటు చేసుకున్న 2మోటర్ల చిన్నంబావి మండలం వెలగొండ గ్రామ శివారులోని గుట్ట కాల్వలపై ఒకే చోట 5మోటార్లను దొంగలించిన సురేష్ కు చెందిన ఆటోలో గుమ్మడం గ్రామంలోని వారి ఇంటి వద్ద ముళ్ల పొదలో దాస్తున్నారు. అదే విధంగా శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లి గ్రామంలో వెంకటాపూర్ వెళ్లేరోడ్డు పక్కన జూరాలపెద్ద కాల్వపై 2మోటార్లు, వెంకటాపూర్ గ్రామంలో శ్రీరంగాపురం వెళ్లే దారిలో జూరాల చిన్న కాల్వపై ఉన్న 3మోటర్లు, పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి గ్రామంలో బూడిదపాడు వెళ్లే దారిలో బావుల దగ్గర 3మోటర్లు, బూడిదపాడు గ్రామ శివారులో వాగుపై 2మోటర్లను దొంగిలించారు. పూర్తిగా మోటర్లు అమ్మితే ఎవరికైనా అనుమానం వస్తుందని, వాటిని విడి భాగాలు చేసి అమ్మాలనే ఉద్దేశంతో వెంకటాపురం శివారులో చోరీ చేసిన 3మోటర్లను ముందుగా గుమ్మడంలో సుత్తెతో పగులకొట్టి విడి భాగాలు చేసి కరెంటు తీగలు వేరు చేసి వాటిని పాల ఇనుప దుకాణంలో విక్రయించేందుకు బుధవారం పెబ్బేరుకు తీసుకువసునతండగాపెబ్బేరు పట్టణంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారు. ఆటోను ఆపి నిందితులను వివరాలు అడడగా వారు సరైన సమాధానం చెప్పలేదు. అనుమానం వచ్చిన పోలీసులు వారిని స్టేషన్ కు తరలించి విచారించగా వారు చేసినదొంగలించిన మిగతామోటర్ల వివరాలు తెలపడంతో వారి స్థావరానికి వెళ్లి మిగతా అన్ని మోటర్లను రికవరీ చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని సీఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతులు గస్తీ దళాలను ఏర్పాటు చేసుకొని పొలం పనులు అవ్వగానే తమ మోటర్లను భద్రపరచాలని సీఐ సూచించారు.

# గర్భిణులకు శ్రీమంత కార్యక్రమం నిర్వహించిన కౌన్సిలర్ దంపతులు



**వనపర్తి రూరల్, మార్చి 9 ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు నర్సింగాయిపల్లిలో మహిళా దినోత్సవ వారోత్సవం సందర్భంగా కౌన్సిలర్ దంపతులు పద్మ పరుశురాంలు గర్భిణీ మహిళలు సుజాత, అనసూయ, ప్రియాంక, హేమలత, సుగణలకు శ్రీమంతం కార్యక్రమం చేపట్టారు. కాలనీలోని ఆడపడుచులను మా ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమ, చీర సారెను పెట్టి సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సొంత కుటుంబసభ్యుల శ్రీమంతం చేసేందుకు ముందుకు రావడంతో గర్భిణీల కుటుంబ సభ్యులు హర్షతిరేకాల వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పద్మ పరుశురామ్ దంపతులు మాట్లాడుతూ ఆడపడుచులను ఆదరించడం మన సాంప్రదాయమని, అన్నింటిల్లో ముందున్న మహిళలు తన ప్రాణా లను పణంగా పెట్టి మరో జీవికి పురుడు పోసి ఆడపడుచులు ఆనందంగా ఉండాలని, వారికి సుఖ ప్రసవం జరగాలని కోరుకుంటూ శ్రీమంత కార్య క్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అనసూయ, ఫీల్డ్ ఆఫీసర్ శకుంతల, చిట్టెమ్మ, రాణి, వసంత రాణి, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## అభాగ్యులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

-ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, మార్చి 9 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు గాయపడిన క్షతగాత్రులకు, అనారోగ్య భారిన పడి చికిత్సలు చేయించుకోలేని అభాగ్యులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్‌ఫండ్, ఎల్‌ఓసీలను అందించి అభాగ్యులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణానికి చెందిన ఫాతిమాకు మంజూరైన 60వేలు, అబ్దుల్ కైఫ్‌కు రూ.20వేలు, వెల్దండ మండలం తిమ్మినోనిపల్లి గ్రామానికి చెందిన అంజయ్యకు రూ.22వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కల్వకుర్తి బీఆర్ఎస్ నాయకులు బృంగి ఆనంద్‌కుమార్‌తో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి మహిళలకు, రైతులకు, క్షతగాత్రులను ఆదుకునేందుకు ఆర్థిక సహాయంతో పాటు సదుపాయాలను కల్పించి వారి కుటుంబానికి భరోసా కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులుషాన్‌వాజ్‌ఖాన్, గోరటి శ్రీనివాసులు, దామోదర్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం



**కల్వకుర్తి, మార్చి 9 ప్రభాతవార్త:** రాష్ట్ర శాసనమండలికి ఎమ్మెల్యేల కోటా అభ్యర్థులు దేశపతి శ్రీనివాస్ మరియు చల్లా వెంకట్రామ్ రెడ్డిలను గురువారం కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



డిఆర్ బసవరాజ్ పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గద్వాల ఎమ్మెల్యే

**ధరూర్, మార్చి9 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు డిఆర్ విజయ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు డి.ఆర్ శ్రీధర్ బాబాయ్ ధరూర్ మండల కేంద్రం చెందిన డిఆర్ బసవరాజ్ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వారి స్వగృహం చేరుకుని ఆయన పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంటగ్రంథాలయ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ్, ఎంపిపి విజయ్, కెటి దొడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఉరుకుందు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు



**నారాయణపేట ప్రతినిధి, మార్చి 9 ప్రభాతవార్త:** గురువారం తెల్లవారు జామున 5 గం.ల ప్రాంతంలో మాగనూరు పెద్దవాగు నుంచి కొత్తపల్లి గ్రామానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్‌ను మాగనూరు గ్రామ శివారులోని కొత్తపల్లి రైల్వే బ్రిడ్జి సమీపంలో మాగనూరు పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను విచారించగా తనపేరు మహేష్ తండ్రి బొంబాయి రవి, మాగనూరు గ్రామం అని తెలుపుతూ ట్రాక్టర్‌కు డ్రైవర్, ఓనర్ తానేనని తెలిపాడు. ఇసుక రవాణా చేసేందుకు అనుమతి పత్రాలుచూపించమని కోరగా ఎలాంటి అనుమతి పత్రాలు చూపించలేదు. ట్రాక్టర్‌ను మాగనూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరెందర్ తెలిపారు.

## కామ్రేడ్ రవన్న 7వ వర్ధంతి సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

**గద్వాల ప్రతినిధి, మార్చి 9 ప్రభాతవార్త:** సుదీర్ఘకాలం సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసి అమరుడైన కామ్రేడ్ రవన్న అలియాస్ రాయల సుభాష్ చంద్రబోస్, మార్చి 10వ తేదీన హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే 7వ వర్ధంతి సదస్సు సభను జయప్రదం చేయాలని సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా గద్వాల జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా గద్వాలడివిజన్ నాయకుడు హలీమ్‌పాషా మాట్లాడుతూ దేశంలో ఎన్నో పోరాటాలతో, త్యాగాలతో ప్రజాస్వామ్యంలో హక్కులు ఆవిష్కరించబడ్డాయని, రాచరికలు పోయి రిపబ్లిక్లు ఏర్పడ్డాయని అన్నారు. కాని నేడు బిజెపి ఫాసిస్టు పాలనలో 73 ఏళ్ల తర్వాత భారత రాజ్యాంగంలోఆమోదించబడ్డ కొద్దిపాటిహక్కులు కూడా నేడు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్త చేశారు. మరోపక్క నిరుద్యోగం, పేదరికం, ఆకలిచావులు పెరుగుతున్నాయని, ప్రజల్లో అసమానతలతో పాటు, సకల రంగాలలో సంక్షోభాలు ఎదురవుతున్నాయని దానిమాటున మతోన్మాదం, కుల రక్కసి కట్టలు తెంచుకుని ప్రజలపై స్వైర విహారం చేస్తుందనిఆరోపించారు. తిండిమీద, కట్టుబట్ట మీద, ఆచార సంప్రదాయాల మీద, స్వేచ్ఛహక్కు మీద, భావ ప్రకటనల మీద ఆంక్షలు విధించే ఫాసిస్టుపాలనలను అంతమొందించాలని అన్నారు. కామ్రేడ్ రవన్న వర్ధంతి సభ సందర్భంగా, ఫాసిస్టు విధానాలపై, మేధావులచే ఉపన్యాసాలు ఉంటాయని ప్రజలు, మేధావులు, జిల్లా నలుమూలల నుండి పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ వర్ధంతి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు జమ్మిచెడు కార్తీక్, హరీష్, గంజిపేట కోళ్లఅంజి, నరసింహ, నితిన్ పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**వీపనగండ్ల, మార్చి9 ప్రభాతవార్త:** వివాహవేడుకకు హాజరై వధూవరులను ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆశీర్వదించారు. వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ పుల్లూరు కరుణ రఘునాథ్‌రెడ్డి ఆహ్వానం మేరకు శ్రీనివాస పద్మావతి కుమార్తె గ్రీష్మ శశిధర్‌రెడ్డిల వివాహ వేడుకకు హాజరయ్యి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకల్లో ఎమ్మెల్యేతో పాటు ప్రజా ప్రతినిధుల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చల్లా వెంకట్రాంరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసిన అలంపూర్ బిఆర్ఎస్ యువజన నాయకులు



ఎమ్మెల్సీ అభ్యర్థి చల్లా వెంకట్రాంరెడ్డిని కలిసిన బిఆర్ఎస్ నాయకులు

**అలంపూర్, మార్చి 9 ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్యే కోటాలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమితుల నామినేషన్ వేస్తున్న చల్లా వెంకట్రామిరెడ్డిని గురువారం అలంపూర్ బిఆర్ఎస్ యువజన నాయకులు ఆర్. కిశోర్ కలసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం!



రైతు కూలీలతో మాట్లాడి, కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

**వనపర్తి టౌన్, మార్చి 9 ప్రభాతవార్త:** సీఐటీయు వ్యవసాయ కార్మిక, రైతు సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని గురువారం వనపర్తి మండలంలోని పెద్దగూడెం, కడుకుంట్ల గ్రామాలలో ప్రచారం జరిగింది. పెద్దగూడెంలో వ్యవసాయ కూలీలతో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వరచారి, సీఐటీయు జిల్లా సహాయకార్యదర్శి గోపాలకృష్ణలు మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర వస్తువుల ధరను తగ్గించాలని పెంచిన గ్యాస్ పెట్రోల్,డీజిల్ ధరలను తగ్గించాలని కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ మార్కెట్ లో దళారీ వ్యవస్థను రద్దు చేయాలని అన్నారు.స్వామినాథన్ సిఫారసులనుఅమలు చేయాలని అన్నారు. ఉపాధిహామీకూలీలకు సంవత్సరంలో 200రోజులు పని కల్పించాలని రోజు కూలీ.600 ఇవ్వాలని,పట్టణ ప్రాంతాలకుఉపాధిహామీ పథకాన్ని వర్తింపజేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, తదితర డిమాండ్ ల సాధన కోసం ఏప్రిల్5న ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని అన్నారు.ఛలో ఢిల్లీ కార్యక్రమంలోలక్షలాది మంది కార్మికులు, కర్షకులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు.

## 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు టిఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న దృశ్యం

**మద్దూరు, మార్చి 9 ప్రభాతవార్త:** మండలంలోని గొర్లోనిబావి గ్రామ పంచాయతీకి సంబంధించిన 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరెందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్‌లో చేరడం జరిగింది. కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు మాట్లాడుతూ కెసిఆర్ చేస్తున్న అభివృద్ధి ఎమ్మెల్యే పట్నం నరెందర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు అందే విధంగా ఎమ్మెల్యే ప్రతినిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉండడం, ఏ క్షణంలోనైనా కార్యకర్తల కోసం కదిలివచ్చే నాయకుడు ప్రజల మంచి కోరుకునే వ్యక్తి పట్నం నరెందర్‌రెడ్డి, తెలంగాణ అభివృద్ధి చెందాలంటే కెసిఆర్ పాలనలో సాధ్యమవుతుందని తెలిపారు. అందువల్ల బిఆర్ఎస్‌లో చేరినట్లు కార్యకర్తలు తెలిపారు.కార్యక్రమంలోజనార్ధన్, రాజు,రాములు, వెంకటయ్య, ఆంజనేయులు,గోపాల్,బాలకృష్ణయ్య, అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దళిత జర్నలిస్టుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల ఎల్లేష్‌కు సత్కారం

**వీపనగండ్ల,మార్చి9 ప్రభాతవార్త:** దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర మహాసభలు జోగులాంబ గద్వాల్ జిల్లాలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్యవార్త చీఫ్ ఎడిటర్ తాటికొండకృష్ణ, దళిత జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాను హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రతి దళిత జర్నలిస్టుకు దళితబంధు, డబుల్ బెడ్ రూమ్, అక్రిడేషన్ కార్డులు,వారి పిల్లలకు ఉచిత విద్య తదితర డిమాండ్లపై మహాసభలు నిర్వహించడం జరిగింది, దళిత జర్నలిస్టు ఫోరం హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగాఎన్నికైనప్పటి నుంచి దళిత జర్నలిస్టులను ప్రభుత్వాలు ఆదుకోవాలని ఎన్నో పోరాటాలు చేయడం జరిగిందని అన్నారు. అందులో భాగం గానే వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన మీసాల ఎల్లేష్‌ను మెమొంటో, శాలువాతో ఘనంగాసత్కరించారు. వీరితో పాటు గ్రేటర్ హైదరాబాద్ జిల్లా కమిటీ సభ్యులు కూడాసన్మానించారు.మీసాల ఎల్లేష్ మాట్లాడుతూ అవార్డులు తీసుకోవడంతో మాపై మరింతబాధ్యత పెరిగిందని, దళిత జర్నలిస్టులఅభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు.

# బాలలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

- ఎస్‌వికె మండల కో ఆర్డినేటర్ శ్రీనివాసులు

**లింగాల,మార్చి 9 ప్రభాతవార్త:** బాలలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఎస్‌వికె మండల కో ఆర్డినేటర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల పరిధిలోని పద్మనపల్లి గ్రామంలో బాలల సంఘాల ప్రతినిధులకు శ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులో నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటే రాబోయే రోజుల్లో ఎక్కడైనా ప్రశ్నించే తత్వం అలవర్చుతుందన్నారు. ప్రతినెల బాలల సంఘం ప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేసుకుని ఆ సమావేశంలో బాలల సమస్యల గురించి చర్చించుకోవాలని సూచించారు. పాఠశాలకు వచ్చే పిల్లలు, పాఠశాలకు రాని పిల్లలు ఈ సమావేశంలో పాల్గొని ఒకరి సమస్యలు ఒకరు చర్చించుకుని వాటికి పరిష్కార దిశగా ముందుకు సాగాలని కోరారు. అనంతరం ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శేఖర్ పాల్గొని మాట్లాడుతూ పిల్లలు ప్రతిరోజు పాఠశాలకు వచ్చినట్లయితే విద్యాభ్యాసంతో పాటు మంచి లక్షణాలను పెంపొందించుకుంటారని అన్నారు. విద్యార్థులు పరీక్షలలో మంచి మార్కులు సాధించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎక్కడైనా పిల్లలపైన అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు జరిగినచో శ్రామిక వికాస కేంద్రం దృష్టికి తీసుకురావాలని తెలిపారు.



బాలల సంఘాల ప్రతినిధులకు శ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

# కనీస వేతనాలు పెంచాలని వినతి

**వనపర్తి టౌన్,మార్చి 9 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా సీఐటీయు కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏఓకి 7డిమాండ్ లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వనపర్తి జిల్లాలో 263 పరిశ్రమలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయని సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో ఏబీడీ లిక్కర్ కంపెనీ, కొత్తకోట మండలం రామకృష్ణాపురం లో శ్రీకృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ పెద్ద కంపెనీలుగా జిల్లా ఉన్నాయని అన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయని, రైస్, ఆయిల్ మిల్లులు 14 మండల్లాల్లో ఉన్నాయని అన్నారు. ఒరిస్సా, బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ తదితర ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చి అతి తక్కువ వేతనాలతో కేవలం రూ.350, పురుషులకు రూ.415 లు రోజుకు ఇచ్చి పని చేయించడం అన్యాయమని అన్నారు.షుగర్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు భయంతో బతుకున్నారని తెలిపారు. శ్రీరాజేశ్వరి పాల ఉత్పత్తి ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మహిళలకు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని, అన్నారు. కావున జిల్లా కలెక్టర్ స్పందించి అన్ని పరిశ్రమాల్లో కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఆయా రంగాల కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ బోనస్ తదితర కార్మిక చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.73 షెడ్యూల్ పరిశ్రమాల్లో కనీస వేతనాలను సవరించి వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, సీఐటీయు నాయకులు నరసింహ, సత్యం ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయంలో 7డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందిస్తున్న సీఐటీయు నాయకులు

## బిజెపి, కాంగ్రెస్ పార్టీలో నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిక

**మూసాపేట,మార్చి 9 ప్రభాతవార్త:** మూసపేట పరిధిలోని నిజలాపూర్ గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు మూసపేట బిజెపి మండల పార్టీ ఉపాధ్యక్షుడు, నిజలాపూర్ గ్రామ బిజెపి పార్టీ అధ్యక్షుడు గాజుబండ భీమన్న, పోల్కంపల్లి మాజీ సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు బిజెపి పార్టీకి చెందిన శ్రీనివాస్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి పాషా, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో గురువారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి ఇంద్రయ్యసాగర్, మూసపేట మడల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీనరసింహ యాదవ్, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆల సమక్షంలో పార్టీలో చేరుతున్న బిజెపి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

# విద్యార్థుల సామర్థ్యాలను మరింతంగా పెంచాలి

- తొలిమెట్టును సమర్థవంతంగా అమలు చేయాలి
- గర్భిణీల ఆరోగ్యం పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తతో ఉంటూ శ్రద్ధ వహించాలి
- 18 ఏళ్లకు పైబడ్డ ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ పి.ఉదయ్‌కుమార్

**అచ్చంపేట, మార్చి 9 ప్రభాతవార్త:** సమతుల్యమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా గర్భిణీలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం బల్మూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వసతులను ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడి అక్కడి వైద్య సేవలపై ఆరా తీశారు. నిరంతరం వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీల వివరాలను అచ్చంపేట ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేసిన కేసుల్లో సాధారణ ప్రసవాల వివరాలను, రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీల వివరాలను వైద్యురాలతో అడిగి తెలుసుకున్నారు. స్టోర్‌ను పరిశీలించి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



ఆసుపత్రిలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

మందుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన గర్భిణీలతో కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీలు తమ ఆరోగ్యంతో పాటు కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్యం కోసం పాటించాల్సిన చర్యలు తీసుకునేలా ఆశాలు, ఎఎనెఎంలు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలన్నారు. గర్భిణీలకు అవసరమైన వివిధ రకాల పరీక్షలు నిర్వహించి రుగ్మతలు గల వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గర్భవతులకు సుఖ ప్రసవం జరిగే వరకు పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కొండనాగుల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించి కంటి వెలుగు కార్యక్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. 18 ఏళ్లకు పైబడ్డ ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు అమలు చేస్తున్న తొలిమెట్టు కార్యక్రమ అమలు తీరును ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించేందుకు కలెక్టర్ విద్యార్థులను టెస్ట్ బుక్ పాఠాలను చదివించారు. విద్యార్థుల తరగతులు వారిగా సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బల్మూర్ వైద్యురాలు ప్రశాంతి, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వ పనులకు ఉపయోగించాలి

- ధరణి, భూసేకరణ ఫైళ్లు పెండింగ్‌లో ఉండొద్దు
- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి రవినాయక్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ జి రవినాయక్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మార్చి 9,ప్రభాతవార్త:** సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వ పనుల నిమిత్తం ఉపయోగించాలని కలెక్టర్ జి రవినాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో తాసిల్దార్లు సమీక్ష నిర్వహించారు. ఇసుక ఎట్టి పరిస్థితుల్లో దుర్వినియోగం చేయరాదన్నారు. మీ సేవ ద్వారా జారీ చేసే ఆదాయం,కుల ధ్రువ పత్రాల విషయంలో తాసిల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సర్వే కోసం రైతులు చేసుకున్న దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, మండలాల్లో సర్వేలు ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్నఈ ఫైళ్లను త్వరితగతిన క్లోజ్ చేయాలని ముఖ్యంగా 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న వాటిపై ముందు దృష్టి సారించాలన్నారు. భూసేకరణకు సంబంధించి ఎక్కడైనా పెండింగ్ ఉంటే తక్షణమే పూర్తి చేయాలన్నారు. ధరణి పెండింగ్ స్లాట్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని,ఎక్కడైనా రైతులు భూమిపై రుణాలు తీసుకుంటే సంబంధిత బ్యాంక్ నుంచి నో డ్యూస్ సర్టిఫికెట్ తీసుకొచ్చిన తర్వాతనే ట్రాన్సక్షన్ చేయాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఇంకా 672 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పరిష్కరించాలని చెప్పారు. అర్బన్ హౌసింగ్ లబ్ధిదారుల వివరాల అప్‌లోడ్‌పై సమీక్షించారు. కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ సీతారామారావు, స్పెషల్ కలెక్టర్ పద్మశ్రీ, ఆర్డీవో అనిల్‌కుమార్, పంచాయతీరాజ్, హౌసింగ్‌ఏఈలునరేందర్‌రెడ్డి, వైద్యంభాస్కర్, కలెక్టరేట్‌ఏవోశంకర్ పాల్గొన్నారు.

# కోయిల్‌సాగర్ పనిముట్లు పదిలం

**దేవరకద్ర,మార్చి 9 ప్రభాతవార్త:** భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ ఎలా నిర్మించి ఉంటారనే ఆలోచన ప్రతి ఒక్కరికి ఉంటుంది. ప్రాజెక్టు అందాలను తిలకించడానికి వచ్చిన ప్రతి సందర్శకులకు ఈ ఆలోచన రానే వస్తుంది. ప్రాజెక్టు ఎంత పటిష్టంగా ఉండడానికి ఏ పని ముట్లు వాడారనే సందేహం కూడా కలుగుతుంది.కాని ప్రాజెక్టు నిర్మాణానికి వాడిన పనిముట్లు ఇప్పటికీ పదిలంగా ఉన్నాయి అంటే నమ్మకం కలగదు కదా...ఖచ్చితంగా ప్రాజెక్టు నిర్మించేటప్పుడువాడిన పనిముట్లు అక్కడే పదిలంగా ఉన్నాయి. అప్పట్లో కోయిల్‌సాగర్ కట్టేటప్పుడు తీసిన ఫొటోలు కూడా పదిలంగా ఉన్నాయి. వాటిని చూస్తే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది.1947-1955 మధ్య కాలంలో ఈ ప్రాజెక్టు నిర్మించారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిర్మించి ఏడాదికి 65 ఏళ్లు అవుతున్నాయి. అప్పట్లో ఎంతో చాకచక్యంగా ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సున్నం, గచ్చు ఉపయోగించి ప్రాజెక్టును నిర్మించారు.ఈ మిశ్రమం తయారుచేయడానికి పెద పెద్ద ఇనుప పనిముట్లు వాడారు. ఓ పెద్ద ఇనుప పని ముట్టు (డంగ్)ను ఉపయోగించి సున్నం, గచ్చు మిశ్రమాన్ని తయారుచేసి ప్రాజెక్టు ఆనకట్ట రాళ్లమధ్యలో సిమెంట్ మాదిరిగా ఉపయోగించారు. ఈ మిశ్రమాన్ని తయారు చేయడానికి అప్పట్లో చేసిన గోతులు కూడా ఇప్పటికి పదిలంగా ఉన్నాయి.పెద్ద ఇనుపచక్రం, ఇనుప చక్రాలు తదితర సామాగ్రి అంతా ప్రాజెక్టు సమీపంలోని కొండాపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో ఎడమవైపు చెట్లమధ్యఉన్నాయి.అప్పట్లోప్రాజెక్టు నిర్మాణానికి ఉపయోగించిన పరికరాలకు ఎలాంటి భద్రత లేకుండా పోయింది.ప్రాజెక్టుకు దూరంగా ఉండడంతో ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకులకుఇవి ఏమాత్రం కనిపించడం లేదు.తెలిసిన వారుఅక్కడికి వెళ్తేకాని ఈ విషయం ఎవరికితెలియదు.కావున ఇప్పటికైనా పాలకులు స్పందించి ప్రాజెక్టు నిర్మాణానికి ఉపయోగించిన పనిముట్లు పర్యాటకులు చూసేలా ప్రస్తుతం ఉన్న గెస్ట్‌హౌజ్ సమీపంలో ఉంచిదానిని సూచించే బోర్డుపెడితే బాగుంటుందని పర్యాటకులు కోరుతున్నారు.

**ఫొటోలు కూడా పదిలం...**

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిర్మించేటప్పుడు దశలవారిగా అప్పట్లో ఎంతో చాకచక్యంతో ఫొటోలు కూడా తీశారు. ఆ ఫొటోలు కూడా ఇప్పటికి ప్రాజెక్టు అధికారులు కార్యాలయంలో భద్రంగా ఉన్నాయి. ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేసినప్పటి నుండి ప్రాజెక్టు పూర్తయ్యే వరకు దశల వారిగా దాదాపు 20 ఫొటోలు తీశారు. కావున ఈ ఫొటోలను కూడా అందరు చూసేలా ప్రాజెక్టు గెస్ట్ హౌస్‌లో ఒక గ్యాలరీ ఏర్పాటు చేస్తే చాలా బాగుంటుందని పర్యాటకులు కోరుతున్నారు. గతంలో తీసిన ఫొటోలు అప్పటి పనితనానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

- నిర్మించేటప్పుడు తీసిన ఫొటోలు కూడా పదిలం



కోయిల్‌సాగర్ ప్రాజెక్టును నిర్మిస్తున్న కూలీలు

1: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఉపయోగించిన ఇనుప చక్రాలు.
2: ప్రాజెక్టు నిర్మించేటప్పుడు సున్నం, గచ్చు కలిపి ఆ మిశ్రమాన్ని సిమెంట్‌లా తయారు చేయడానికి అప్పట్లో తీసిన గోతి
3: కోయిల్‌సాగర్ నిర్మాణానికి ఉపయోగించిన పెద్ద ఇనుప చక్రం
4: కోయిల్‌సాగర్ నిర్మాణానికి ఉపయోగించిన చిన్న చక్రాలు
5: ప్రాజెక్టు నిర్మాణానికి మిశ్రమాన్ని కలపడానికి ఉపయోగించిన పెద్ద పల్లెం



(1)



(2)



(3)



(4)



(5)